


'మన ఊరు - మనబడి' నిధులతో నిర్మించిన వడ్డేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల


వడ్డేపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్మించిన డైనింగ్ హాల్


# వడ్డేపల్లి స్కూల్‌కు మహర్దశ

- ప్రభుత్వ పాఠశాలకు ఆధునిక సొబగులు
- 'మన ఊరి - మనబడి'తో కార్పొరేట్ కళ
- రూ.84 లక్షలతో మౌలిక, కనీస వసతులు
- చూడముచ్చటైన తరగతి గదులు, ల్యాబ్
- సీఎం కేసీఆర్‌కు గ్రామస్తుల కృతజ్ఞతలు
- నేడు వడ్డెపల్లి పాఠశాలలను ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, అక్టోబర్ 8 : సర్కార్ బడుల స్వరూపాన్ని మర్చే లక్ష్యంతో ప్రభుత్వం 'మనఉరు-మనబడి' కార్యక్రమానికి అంకుర్పారణ చేసింది. ఇందులో భాగంగానే మొదటి విడుతలో రాయపోల్ మండలంలో పలు పాఠశాలలను ఎంపిక చేసింది. 'మనఉరు-మనబడి' నిధుల ద్వారా వడ్డేపల్లి ఉన్నత పాఠశాలతోపాటు ప్రాథమిక పాఠశాలను ఆధునికంగా తీర్చిదిద్దారు. పాఠశాలల అభివృద్ధి జరగడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కరం లభించింది.


వడ్డేపల్లి ఉన్నత పాఠశాలలో డైనింగ్‌హాల్‌కు రూ.14లక్షలు, ఎలక్ట్రికల్ రిపేరింగ్‌కు రూ.2లక్షలు, తాగునీటి సమస్య పరిష్కరానికి రూ. 1.20లక్షలు, పాఠశాలలో వివిధ రకాల అభివృద్ధి పనులకు రూ. 2లక్షలు, ప్రహరీ నిర్మాణానికి రూ.8.75 లక్షలు, ముత్రశాలలు, వంట గదులను నిర్మించారు. ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ. 29లక్షలు, మరుగు దోడ్లు, ఇతర పనులకు రూ.7లక్షలు కేటాయించారు. పనులన్నీ పూర్తికావడంతో పాఠశాల రుపురేఖాలు మరిపోయాయి. కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా వడ్డేపలిల పాఠశాలను అభివృద్ధి చేయడంతో మండలంలోనే ఆదర్శంగా నిలిచింది.

ప్రభుత్వ నిధులతో కిచెన్‌షెడ్, మరుగుడొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం కల్పించారు. విద్యుదీకరణ పనులు చేపట్టారు. ఇతర మరమ్మతులు, భవనాలు, క్లాస్‌రూంలో పెయింటింగ్ వేయించారు. పాఠశాల ఆరుబయట గోడలకు ంగులు వేయగా, తరగతి గదుల్లో గోడలకు ఒకే రంగును ఉపయోగించారు. తరగతి గదుల్లో గ్రీన్ బోర్డులు, 40 డ్యూయల్ డెస్కులు ఏర్పాటు చేశారు. ఆధునాతన హంగులతో వడ్డేపల్లి ఉన్నత పాఠశాల కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారు.


వడ్డేపల్లి ఉన్నత పాఠశాలలో డిజిటల్ క్లాసులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

### ఆకట్టుకున్న ఉన్నత పాఠశాల స్వాగత తోరణం

వడ్డేపల్లి ఉన్నత పాఠశాల 'మనఉరు-మనబడి'లో నిర్మించిన స్వాగత తోరణం అకట్టుకుంటున్నది. ప్రహారీ మధ్యలో ఎత్తైన స్వాగతం తోరణాన్ని ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలు



వడ్డేపల్లి ఉన్నత పాఠశాల స్వాగత తోరణం

ఒకే దగ్గరలో ఉండడంతో సకల వసతులు ఏర్పాటు చేశారు. రోడ్డు పక్కనే పాఠశాలలు చూడముచ్చటగా ఉన్నాయి.

### నేడు పాఠశాలలను ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

వడ్డేపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాల 'మనఉరు-మనబడి' ద్వారా అభివృద్ధి చేయడంతోపాటు విద్యార్థులకు కనీస, మౌలిక వసతులు కల్పించారు. పాఠశాలలను సోమవారం మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితోపాటు స్థానిక నాయకులు ప్రారంభించానున్నారు.

### బడిని అద్భుతంగా తీర్చిదిద్దాం



'మనఉరు-మనబడి'లో వడ్డేపల్లి లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను అభివృద్ధి చేశాం. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో మౌలిక వసతులతోపాటు తరగతి గదుల కొరత తీరింది. విద్యార్థులకు సరిపడే కిచెన్‌షెడ్ నిర్మించాం. విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించాం. ప్రతి తరగతి గదిలో డ్యూయల్ డెస్క్‌తోపాటు గ్రీన్‌బోర్డు ఏర్పాటు చేశాం. వడ్డేపల్లి పాఠశాతలకు కొత్త రూపు వచ్చింది.

**- బచ్చు చంద్రశేఖర్, సర్పంచ్ వడ్డేపల్లి**

## జాతీయ స్థాయి ఇన్‌స్పైయిర్‌కు నందిని


నందినికి అవార్డు అందజేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి (ఫైల్)

పాపన్నపేట, అక్టోబర్ 8 : మండలంలోని నాగ్‌సాన్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని నందిని జాతీయస్థాయి ఇన్‌స్పైయిర్ ప్రదర్శనకు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వరకు న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఇన్‌స్పైయిర్‌మనక్ ప్రదర్శనలో నందిని పాల్గొంటున్నట్లు తెలిపారు. జనవరిలో నిర్మల్ పట్టణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రదర్శనలో నందిని ప్రదర్శించిన అడ్జస్టబుల్ గ్యాస్ స్టవ్ ఫ్లాట్‌ఫారం ప్రాజెక్ట్ జాతీయస్థాయికి ఎంపికైన విషయం తెలిసిందే. అప్పట్లో నందినికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రశంసాపత్రం అందజేశారు. ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు గుర్తింపు తేవాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా, నాగ్‌సాన్‌పల్లి పాఠశాల ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

## రెడ్డి సంక్షేమ భవన్‌లో జాబ్ మేళా

- ఎంపికైన 38 మంది యువతీ యువకులు

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 8 : జిల్లాకేంద్రం సిద్దిపేటలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో ఎంఎస్‌ఎన్ ల్యాబ్ హైదరాబాద్ సౌజన్యంతో ఆదివారం జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాను ఏఎంసీ చైర్మన్ మచ్చ విజితావేణుగోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు పదేండ్లుగా అనేక జాబ్‌మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఇంటర్‌తోనే ఉపాధి అవకాశం పొంది, చదువుతూ ఉద్యోగం చేసుకునే గొప్ప అవకాశం ఎంఎస్‌ఎన్ ల్యాబ్ కల్పించారన్నారు. జాబ్‌మేళాలో 200 మంది పాల్గొనగా, 38 మంది ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎన్ ల్యాబ్ ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కొమురవెల్లిలో ఆది మానవులు..!

- పరిశోధించిన డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి

చేర్యాల, అక్టోబర్ 8 : కొమురవెల్లిగుట్ట మధ్య శిలాయుగానికి చెందిందని, ఇక్కడ ఆదిమమానవుల ఆవాస ప్రాంతమని ప్రముఖ చరిత్ర పరిశోధకుడు, డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన తన పరిశోధన వివరాలు తెలిపారు. మల్లన్నగుట్టకు తూర్పువైపు మొత్తటి పొలం, చెల్క భూములు ఉన్నాయని, ఈ ప్రాంతంలో ఎరుపు రంగుల్లో ఉన్న సూక్ష్మరాతి పనిముట్లు లభించాయని తెలిపారు. ఇక్కడి శిథిల పనిముట్లు మధ్య శిలాయుగానికి చెందినవి అన్నారు. కొండగుహల్లో జీవించిన మానవులు కొండదిగి తూర్పు వైపు ఆవాసాలు ఏర్పరచుకున్నారని, అందుకు సాక్ష్యంగా ఎరుపు, నలుపు, బూడిద రంగులో ఉన్న కుండపెంకులు, చిట్టెపు రాళ్లు లభించినట్లు తెలిపారు. కొమురవెల్లి గుట్టపై 9 లేదా 10వ శతాబ్దంలో జైన సన్యాసులు ధ్యానం చేసుకున్నారని, హనుమాన్‌గుడి మెట్లెక్కే మార్గంలో కుడివైపు ఒక శిలకు సుపార్శ్వనాథ శిల్పం చెక్కి ఉందని, ఈ శిల్పాన్ని గతంలో సముద్రాల సునీల్ గుర్తించినట్లు తెలిపారు. మరోగుట్ట దిగువన బృహత్ శిలాయుగం నాటి స్మశానవాటిక ఉందని, ఇక్కడ అనేక సంఖ్యలో రాక్షస గూళ్లు ఉన్నాయన్నాయని వివరించారు. పురావస్తుశాఖ పరిశోధన చేస్తే విలువైన చరిత్ర వెలుగులోకి వస్తుందన్నారు.

### తంగళ్లపల్లి ఆలయ ప్రాంతంలో

## కొత్త రాతియుగపు ఆనవాళ్లు

- ఆర్కియాలజిస్ట్ శివనాగిరెడ్డి

కోహెడ, అక్టోబర్ 8 : మండలంలోని మోయతుమ్మెద వాగు తీరాన వెలిసిన వేణుగోపాలస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో కొత్త రాతియుగపు ఆనవాళ్లు లభించినట్లు ప్రముఖ ఆర్కియాలజిస్ట్ శివ నాగిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయ పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామ పరిసరాల్లో మరిన్ని ఆనవాళ్లు ఉన్నటు, వీటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గొట్లమిట్ట గ్రామంలో నిర్మిస్తున్న శివాలయాన్ని పరిశీలించడానికి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. వేణుగోపాలస్వామి ఆలయం ఇరువైపుల పరుపు బండపై 15 నుండి 30 సె.మీ. పొడవు, 3 నుండి 6 సె.మీ. వెడల్పు గల గొడ్డల్లను పదును పెట్టుకును గుంతలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇది సుమారు క్రీస్తు పూర్వం 4 వేల సంవత్సరాల క్రిందివని వివరించారు. ఆయన వెంట నాయకులు వట్టిపెల్లి లింగారెడ్డి బొలుమల్ల ఎల్లయ్య, మీసాల రాజయ్య, షేక్ రబ్బానీ, నానువాల ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## సెల్ ఫోన్ అప్పగింత

చేర్యాల, అక్టోబర్ 8 : పోగొట్టుకున్న సెల్‌ఫోన్ సీఈఐఆర్ టెక్నాలజీతో పోలీసులు స్వాధీనం చేసుకుని బాధితుడికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణానికి చెందిన గంధ్ర సృజన్ తన సెల్‌ఫోన్ సెప్టెంబర్ 14న పట్టణంలో పోగొట్టుకున్నాడు. బాధితుడి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని చెప్పారు. సీఈఐఆర్ టెక్నాలజీతో సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని బాధితుడికి అందజేశామని తెలిపారు. పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చున్నారు. తద్వారా కోల్పోయిన ఫోన్ తిరిగి త్వరగా పొందవచ్చని తెలిపారు.

## నేడు ఆయిల్‌పామ్ సందర్శన

చేర్యాల, అక్టోబర్ 8 : పట్టణానికి చెందిన శనిగరం మల్లేశం తన వ్యవసాయ భూమిలో సాగు చేసిన ఆయిల్‌పామ్ పంటను సోమవారం తెలంగాణ స్టేట్ కన్సల్టెంట్ ఫర్ ఆయిల్‌పామ్ కల్టివేషన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పామ్ రిసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ బీఎన్‌రావు సందర్శించనున్నట్లు ఏవో ఆఫ్రోజ్ ఆదివారంఒక ప్రకటనలో తెలిపారు. ఆయిల్‌పామ్ సాగును పరిశీలించేందుకు ఉన్నతస్థాయి శాస్త్రవేత్తతోపాటు అధికారులు సోమవారం ఉదయం 9 గంటలకు చేర్యాలకు వస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ రైతులందరూ చేర్యాల రైతువేదిక సమీపంలోని శనిగరం మల్లేశం ఆయిల్‌పామ్ క్షేత్రానికి రావాలని కోరారు.

# కాంగ్రెస్‌కు చోటులేదు..

- బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నేతలు
- ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన అల్మాయిపేట్ సర్పంచ్, పోసానిపేట్ ఎంపీటీసీ దంపతులు.
- గులాబీ గూటికి బీఎస్పీ నేత బుచ్చయ్య

అందోలు, అక్టోబర్ 8 : సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అకర్శితులై కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. అందోలు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కంచుకోటకు బీటలు వారుతున్నాయని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పేర్కొ న్నారు. ఆదివారం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సమక్షంలో అల్మాయిపేట్ సర్పంచ్ బాలమణీరవిశంకర్, పోసానిపేట్ ఎంపీటీసీ ఉమారాణీసురేందర్, అల్మాయిపేట్‌లో వార్డు సభ్యులు వీరేశం, భిక్షపతితోపాటు 200మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరితోపాటు 2018లో బీఎస్పీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన బుచ్చయ్య బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మాట్లాడుతూ అందోలు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి చోటులేదు, బీఆర్‌ఎస్‌కు తిరుగులేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో సరైన గౌరవం లేక, వలసవాదుల పెత్తనంలో పనిచేయలేక ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆత్మగౌరవం, అభివృద్ధికి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు.



ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న పోసానీపేట్ ఎంపీటీసీ ఉమారాణి సురేందర్ దంపతులు

బీఆర్‌ఎస్‌లో అందరికీ సముచిత స్థానం ఇస్తామని, అందోలు గడ్డపై గులాబీ జెండా ఎగరవేయడమే ఏకైక లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. ముందుగా భారీ ర్యాలీతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేశారు. కార్యక్రమంలో స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పల్లె సంజీవయ్య, ఎంపీపీ బాలయ్య, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గంగాధర్, నాయకులు రాజుముదిరాజ్, శంకర్‌గౌడ్, జహంగీర్‌రెడ్డి, సర్పంచ్‌లు ప్రవీణ్‌రెడ్డి, లింగాగౌడ్, అనిల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పుల్కల్ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.